# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టుకు అనుసంధానంగా పారిశ్రామికాభివృద్ధిని చేపడతున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ 68వ రాష్ట్ర స్థాయి విలు విద్య పోటీలను పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఈరోజును ప్రారంభించారు.
- ❖ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం వృద్ధులకు వరంలాంటిదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో గాజుల మహోత్సవం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది.

==========================

శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టుకు అనుసంధానంగా పారిశ్రామికాభివృద్ధిని చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. పారిశ్రామికాభివృద్ధికై మూలపేట సమీపంలో విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. వంశధార, బాహుదా నది అనుసంధానాన్ని మెగా ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని కేంద్రమంత్రి పేర్కొంటూ ....

(వాయిస్ 40 సెకన్లు)

==========================

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో గాజుల మహోత్సవం ఘనంగా ఈరోజు ప్రారంభమైంది. అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రంగులతో కూడిన అందమైన గాజులతో ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప ఆలయాలు, అమ్మవారి మూలవిరాట్ ను

సుందరంగా అలంకరించారు. మహా మండపం ఆరవ అంతస్తులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా గాజులతో అలంకరించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారాంతపు సెలవులకు తోడు కార్తీక మాసం ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారి కే.ఎస్. రామారావు తెలిపారు.

==========================

తిరుపతి జిల్లా వడమాలపేటలో చిన్నారి హత్యాచార కేసును ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబ సభ్యులకు 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం తరపున హోం మంత్రి ఈ రోజు అందజేశారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న వారికీ వెంటనే శిక్ష పడే విధంగా కేసులను ప్రత్యేక కోర్టుకు అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

రాష్ట్ర స్థాయి 68వ విలు విద్య పోటీలు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకులం మైదానంలో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఈరోజును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు విద్యార్థులు శ్రమించాలని పిలుపునిచ్చారు. మన్యం ప్రాంతంలోని విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభ చూపేందుకు ఇది మంచి అవకాశమన్నారు. క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవడం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. తిరుపతి నాయుడు మాట్లాడుతూ... ఈ పోటీల్లో ప్రతిభ చూపే క్రీడాకారులు గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు.

విరామం

==========================

ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం వృద్ధులకు వరంలాంటిదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం శివ దేవుని చిక్కాల గ్రామంలో ఆయుష్మాన్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకానికి సంబంధించి వృద్ధుల దరఖాస్తు నమోదు, గుర్తింపు కార్డు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులు వైద్య సేవల ఖర్చులకై కుటుంబంపై ఆధారపడకుండా, వారి ఆరోగ్య రక్షణకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన వృద్ధులు ఈ పథకానికి దరఖాస్తు చేయాలని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 24 సెకన్లు)

==========================

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కోడి రామ్మూర్తి స్టేడియంలో 68వ రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పాత్రునివలసలో 33 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని, ఖేల్ ఇండియా పథకం ద్వారా జిల్లాకు మరి కొన్ని క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. జిల్లాలో 4 ప్రత్యేక సింథటిక్ స్పోర్ట్స్ మైదానాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు.

==========================

శ్రీకాళహస్తీశ్వర ఆలయ నూతన కార్యనిర్వహణ అధికారిగా టి.బాపిరెడ్డి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అందరి సహకారంతో శ్రీకాళహస్తి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని, భక్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. అన్ని సదుపాయాలు కల్పిస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో నిర్మాణరంగంలో  ఉపాధి అవకాశాలు పెరిగాయని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ రోజు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో గుంతల రహిత రహదారులను సంక్రాంతి నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటుగా అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నదని అన్నారు.

==========================

==========================